ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 17 మార్చి 2025



ఏళ్ల తరబడి ఆశగా ఎదురుచూస్తున్న దివిసీమలోని గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అడుగులు వడివడిగా పడుతున్నాయి. ఇప్పటికే గ్రాండ్ ఎంట్రన్స్, పరిపాలనా భవనాలు సిద్ధం కాగా, త్వరలో పరీక్షా కేంద్రానికి కూడా శంకుస్థాపన చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని, వెనువెంటనే క్షిపణి పరీక్షలు మొదలుపెట్టాలని కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ నిర్ణయించింది. కాగా, అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన నిమిత్తం ఏప్రిల్‌లో రానున్న ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగానే ఈ క్షిపణి పరీక్షా కేంద్రానికి కూడా శంకుస్థాపన చేయించాలని అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు.

వేగంగా..

గుల్లలమోదలోని క్షిపణి పరీక్షా కేంద్రానికి త్వరలో శంకుస్థాపన

ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా భూమిపూజ..?

అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపనకు వచ్చిన సందర్భంలోనే..



మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌లో సిద్ధమైన పరిపాలనా భవనం

- ఇప్పటికే గ్రాండ్ ఎంట్రన్స్, పరిపాలనా భవనం పూర్తి
- రూ.2 వేల కోట్లతో తొలిదశలో అభివృద్ధి
- భవిష్యత్తులో రూ.20 వేల కోట్ల వరకు విస్తరణ



గుల్లలమోదలో ఏర్పాటుచేసిన మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ గ్రాండ్ ఎంట్రన్స్

కీలకమైన క్షిపణుల పరీక్షలు ఇక్కడే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దశాబ్దంన్నర కాలంగా ఎదురుచూస్తున్న మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ (క్షిపణి పరీక్షా కేంద్రం) శంకుస్థాపనకు కౌంట్‌డౌన్ మొదలైంది. త్వరలో నాగాయలంకలోని మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌కు భూమిపూజ జరిపేందుకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌లో పరిపాలనా భవనం పూర్తయింది. టెస్టింగ్ అవసరాలకు సంబంధించిన యూనిట్లను, బ్లాక్‌లను నిర్మించాల్సి ఉంది. రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు ఏప్రిల్‌లో ప్రధాని నరేంద్రమోదీ వచ్చినపుడు ఈ మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌కు కూడా శంకుస్థాపన చేయించే అవకాశాలున్నాయి. వాస్తవానికి ఇటీవల మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంలోనే ఆయనతో వర్చువల్‌గా శంకుస్థాపన చేయించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. చివరి నిమిషంలో దీనిని తప్పించాల్సి వచ్చింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు కావటంతో మోదీతో ప్రత్యేకంగా భూమిపూజ చేయించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. అనూహ్యంగా అమరావతి పునర్నిర్మాణ పనులకు పీఎం వస్తే తప్పకుండా ఆయనతో ఈ టెస్టింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయించాలని భావిస్తున్నారు. అమరావతి కార్యక్రమం లేకపోయినప్పటికీ త్వరలో మోదీ చేతులమీదుగానే ఈ కార్యక్రమం జరిగే అవకాశముంది.

ఏళ్ల నిరీక్షణకు తెర

ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ కార్యకలాపాలు మిగతా 6లో..

మిస్సైల్స్ పరీక్షలు

ఈ సెంటర్‌లో ప్రధానంగా డీఆర్‌డీవో ఆవిష్కరించే అనేక రకాల మిస్సైల్స్‌ను పరీక్షిస్తారు. పరీక్షల అనంతరం గుర్తించిన అంశాలతో వీటిని మరింత అభివృద్ధి చేస్తారు. ప్రత్యేకంగా రెండు రకాల మిస్సైల్స్‌కు ఇక్కడ పరీక్షలు నిర్వహించే అవకాశముంది. దూరప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే బాలిస్టిక్ మిస్సైల్స్‌తో పాటు క్రూజ్ మిస్సైల్స్ యాంటీ మిస్సైల్స్ సిస్టమ్స్ వంటివి ఇక్కడ పరీక్షిస్తారు. మిస్సైల్ గైడెన్స్ సిస్టమ్స్, ప్రొపల్షన్ సిస్టమ్స్‌తో పాటు అనేక కీలక సాంకేతిక విభాగాలు ఏర్పాటు చేస్తారు. సిమ్యులేషన్, డేటా విశ్లేషణ కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తారు. మిస్సైల్స్‌ను పరీక్షించిన సందర్భంలో డేటాను విశ్లేషించేందుకు కంప్యూటర్ ఆధారితంగా సిమ్యులేషన్ వ్యవస్థలను ఉపయోగించుకుంటారు.

భారత రక్షణ పరిశోధనల్లో కీలకం

గుల్లలమోదలో ఏర్పాటుచేసే మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ భారత రక్షణ పరిశోధనలో కీలకమైనదిగా చెప్పొచ్చు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును రూ.2 వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నప్పటికీ భవిష్యత్తులో రూ.20 వేల కోట్ల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంది. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) నిర్వహించే మిస్సైల్స్ ప్రాజెక్టుల పరీక్షలు, అభివృద్ధిలో ఈ కేంద్రం తనదైన పాత్రను పోషించనుంది.



బస్సుల్లేవ్!

విజయవాడ సబర్బన్‌లో తగ్గిపోతున్న ఆర్టీసీ సర్వీసులు

400 నుంచి 283 పడిపోయిన సిటీ బస్సులు

- షెడ్యూల్ ప్రకారం కూడా నమోదు కాని కిలోమీటర్లు
- బస్సుల ఆక్యుపెన్సీ రేషియోపై తీవ్ర ప్రభావం
- బస్సులు తగ్గిపోవటంతో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- కొత్త బస్సులు వస్తేనే ఆర్టీసీకి మనుగడ!

ఒకప్పుడు నగరంలో బస్టాప్‌ల వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు క్యూ కట్టిన సిటీ సర్వీసులు నేడు చూద్దామన్నా కనిపించని స్థితికి చేరాయి. 400 నుంచి 283 బస్సులకు తగ్గిపోయాయి. ఉన్న బస్సులు కూడా కండీషన్‌లో లేకపోవడం తదితర కారణాలతో షెడ్యూల్ ప్రకారం కూడా కిలోమీటర్లు తిరగలేని దుస్థితి ఏర్పడింది. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఆర్టీసీ సర్వీసులు నడవకపోవడంతో ప్రయాణికులు ఆటోలు, క్యాబ్‌లు తదితర ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. ఇదే విధంగా మరింతకాలం కొనసాగితే ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకం కానుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలో సిటీ బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 400 నుంచి 283 బస్సులకు పడిపోయాయి. సిటీ ఆర్డినరీలు 175 బస్సులు ఉండగా.. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు 108 ఉన్నాయి. ఈ బస్సులన్నీ అక్టోబరు 10, 2024 నాటికి ఉన్న సంఖ్య. గడచిన నాలుగు నెలల్లో మరో 25 బస్సుల వరకు తగ్గిపోయినట్లు సమాచారం. భారీ సంఖ్యలో తగ్గిపోవటం వల్ల నగర ప్రజల అవసరాలకు తగిన విధంగా బస్సులు చాలటం లేదు. దశాబ్దం కిందట విజయవాడ నగర జనాభా ఎనిమిది లక్షలుగా ఉండేది. ప్రస్తుతం విజయవాడ నగర జనాభా 14 లక్షలుగా ఉంది. భవిష్యత్తులో ఈ జనాభా మరింత పెరిగే అవకాశం ఉంది. నానాటికీ పెరిగిపోతున్న జనాభాకు అనుగుణంగా బస్సులు పెరగటం లేదు సరికదా.. మరింత తగ్గిపోవటం ఆందోళనకరంగా మారుతోంది. నగర ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా బస్సులు లేకపోవటం ఒక ఎత్తు అయితే ప్రస్తుతం నడుస్తున్న సిటీ బస్సులలో కూడా సగానికి పైగా కాలం తీరిపోయి ఉన్నాయి. నడుస్తున్న బస్సుల కండీషన్ కూడా ఏ మాత్రం బాగోవటం లేదు. డొక్కు బస్సులలో ప్రయాణం చేయాలంటే ప్రయాణికుల ఒళ్లు హూనమైపోతోంది. దీనికి తోడు ఎప్పుడు, ఎక్కడ రోడ్ల మీద సడెన్‌గా బస్సులు ఆగిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. పూర్వం రోజుల్లో అడపాదడపా బస్సులు మిగతా 6లో..

విజయవాడ సిటీ బస్సుల వివరాలు

క్రసం	సిటీ బస్ డిపో	మెట్రో ఎక్స్‌ప్రెస్	సిటీ ఆర్డినరీ	మొత్తం
1.	గవర్నర్ పేట - 1	18	42	60
2.	ఇబ్రహీంపట్నం	26	33	59
3.	గవర్నర్ పేట - 2	52	32	84
4.	విద్యాధరపురం	12	68	80
	మొత్తం	108	175	283

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం జిల్లాలోని 25గ్రామ పంచాయతీలు, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్, గుడివాడ పురపాలక సంఘం, గుడ్లవల్లేరు పంచాయతీలకు శాపంగా మారింది. అభివృద్ధి పేరుతో గ్రామాల విలీన ప్రతిపాదనలు తెరపైకి తెచ్చి పూర్తి చేయకుండా వదిలేసింది. ఫలితంగా ఆయా కార్పొరేషన్, పురపాలక సంఘం, గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. నాలుగేళ్ల నుంచి పంచాయతీ అధికారుల పాలనే కొనసాగుతోంది. పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిధులు ఆగిపోయి అభివృద్ధి కుంటుపడుతోంది. మళ్లీ ఏడాదిలో వచ్చే ఎన్నికలు నాటికైనా ఈ విలీన ప్రక్రియ పూర్తి చేయాలని ఆయా గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

వీడని గ్రహణం

గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో 25 పంచాయతీల విలీనానికి ప్రతిపాదనలు

మచిలీపట్నం కార్పొరేషన్, గుడివాడ మున్సిపాల్టీ, గుడ్లవల్లేరు పంచాయతీల విస్తరణకు ప్రణాళికలు



గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయం

- ఆయా ప్రాంతాల్లో 2021లో నిలిచిపోయిన ఎన్నికలు
- నాటి నుంచి నేటి వరకు ప్రత్యేక అధికారుల పాలనే దిక్కు
- మళ్లీ ఎన్నికలు వచ్చే నాటికైనా విలీన ప్రక్రియ పూర్తి చేస్తారా?!
- పాలకవర్గాలు లేక నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉమ్మడి కృష్ణాజిల్లాలో 25 గ్రామ పంచాయతీలు పాలకవర్గాలు లేక త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్, గుడివాడ పురపాలక సంఘంలో కొన్ని పంచాయతీలను విలీనం చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి నాలుగేళ్ల క్రితం ప్రభుత్వానికి నివేదికలు పంపారు. నేటి వరకు వీటి ఊసేలేదు. మరో ఏడాదిలో పంచాయతీలు, పురపాలక సంఘాల పాలకవర్గాల పదవీకాలం పూర్తయి ఎన్నికలు జరగనున్నాయి. ఈలోపైనా పంచాయతీలను పురపాలక సంఘాల్లో విలీనం చేసే అంశంపై జిల్లా అధికారులు దృష్టి సారిస్తారా లేదా అనే అంశంపై అనేక అనుమానాలు ఉన్నాయి. గతంలోనే ప్రభుత్వానికి నివేదికలు పంపామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని పంచయతీరాజ్‌శాఖ అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీకి పట్టున్న పంచాయతీల్లో ఎన్నికలు జరగకుండా నిలిపివేసేందుకు అధికార పార్టీ నాయకులు అప్పట్లో తెరవెనుక కుట్రలు చేసి పంచాయతీలను పురపాలక సంఘాల్లో విలీనం చేసే ప్రతిపాదనలను తెరపైకి తెచ్చారనే విమర్శలు లేకపోలేదు. అయితే ఈ ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉండగానే 2021 ఫిబ్రవరిలో పంచాయతీలకు, 2021 మార్చిలో పురపాలక సంఘాలకు ఎన్నికలు జరిగాయి. పురపాలక సంఘాల్లో విలీనం చేసేందుకు ప్రతిపాదించిన పంచాయతీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. ఎన్నికలు జరగని పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో గత నాలుగు సంవత్సరాలుగా ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతోంది. ప్రత్యేక అధికారులు మిగతా 6లో..

కొద్దిపాటి ఆదాయంతోనే సరి..

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 25 పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. దీంతో ఈ పంచాయతీల్లో ఇంటి పన్నులు, ఇతరత్రా మార్గాల్లో వచ్చే కొద్దిపాటి నిధులతో ప్రత్యేక అధికారులు నెట్టుకొస్తున్నారు. ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ విభాగం ఏఈలు ఈ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా కొనసాగుతున్నారు.

మళ్లీ ఎన్నికలు జరిగే వరకు ఇంతే..

పురపాలక సంఘాల్లో విలీనమయ్యే, నగర పంచాయతీగా ఏర్పడే గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది వ్యవధిలో ఎన్నికలు జరిగే అవకాశం లేదని పంచాయతీరాజ్ విభాగం అధికారులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, విలీనప్రక్రియ ఆలస్యమవుతుందని, మిగిలిన వ్యవహారం పురపాలకశాఖ అధికారులు చూస్తారని డీపీవో కార్యాలయ అధికారులు పేర్కొంటున్నారు. వచ్చే ఏడాదిలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికైనా వీటి విలీనంపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని ఎన్నికలు నిర్వహించాలని ఆయా గ్రామ పంచాయతీలు, గుడివాడ పురపాలక సంఘంలోని ప్రజలు కోరుతున్నారు.



ఇదిగో.. ఓవర్ లోడు!

- పట్టని అధికారులు

6లో

అమరజీవి త్యాగం అజరామరం

- పొట్టి శ్రీరాములుకు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాళి 6లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-22 (సోమవారం సాయంత్రం)

సహర్ : 04-54 (మంగళవారం ఉదయం)

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడాపోటీలు రేపు

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు 6లో

టీడీపీ నాయకుడిపై దాడి

దివ్యాంగుడని కూడా చూడకుండా విచక్షణారహితంగా కొట్టిన వైసీపీ మూకలు

పెడన, మార్చి16(ఆంధ్రజ్యోతి): పెడన నియోజకవర్గం టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు సులేమాన్(దాదా)పై వైసీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. పెడన సెంటరులోని ఒక టీస్టాల్ వద్ద సులేమాన్ టీ తాగుతుండగా, వైసీపీ కౌన్సిలర్, అతని సోదరుడు, మరి కొందరు వైసీపీ కార్యకర్తలు అక్కడకు వచ్చారు. వచ్చీ రాగానే సులేమాన్‌తో వాదనకు దిగారు. అప్పటికే తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్న కర్రలతో వైసీపీ కౌన్సిలర్, అతని అనుచరులు దివ్యాంగుడైన సులేమాన్‌పై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన బాధితుడిని స్థానికులు హుటాహుటిన 108లో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. దాడికి పాల్పడిన కౌన్సిలర్ వైసీపీ ప్రభుత్వ హయాంలో పేకాట శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహించి వివాదాస్పదుడిగా మారాడని స్థానికులు చెబుతున్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

జిల్లాలో 145 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

- హాజరుకానున్న 22,341 మంది విద్యార్థులు
- పర్యవేక్షణకు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం టౌన్): జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు ఆయా పోలీస్ స్టేషన్లకు చేరాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ విధించారు. జిల్లాలో మొత్తం 22,341 మంది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో రెగ్యులర్ విద్యార్థులు 21,075 మంది, ప్రైవేటు అభ్యర్థులు 1,266 మంది ఉన్నారు. బాలురు 11,770 మంది, బాలికలు 10,571 మంది పరీక్ష రాయనున్నారు. జిల్లాలో 70 ఏ కేటగిరీ సెంటర్లు, 23 బి కేటగిరీ సెంటర్లు, 52 సి కేటగిరి సెంటర్లు ఉన్నాయి. 145 పరీక్షా కేంద్రాలకు 145 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 145 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. 52 మంది కస్టోడియన్‌లను నియమించారు. 1300 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. ఇలా మొత్తం దాదాపు రెండు వేల మంది ఈ పరీక్ష విధుల్లో పనిచేస్తున్నారు. 29 పోలీస్ స్టేషన్‌ల నుంచి ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రాలు తీసుకుని వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే రెండు సెట్‌ల ప్రశ్నా పత్రాలను పోలీస్ స్టేషన్‌ల్లో భద్రపరిచారు. 52 సి కేటగిరి మిగతా 6లో..

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

పరీక్షల నిర్వహణపై జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు డీఈవో పి.వి.జె.రామారావు తెలిపారు. ఏ విధమైన సంఘటన జరిగినా 98482 32601, 94900 50226 నంబర్లకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.



మంత్రి నారాయణ, హడ్కో అధికారులకు అర్చకుల ఆశీర్వచనం

దుర్గమ్మ సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మునిసిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ హడ్కో అధికారుల బృందంతో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేయగా, అధికారులు శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు ఇచ్చి సత్కరించారు. మంత్రితో పాటు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కుల్‌శ్రేష్ఠ, కార్పొరేట్ ప్లానింగ్ డైరెక్టర్ ఎం.నాగరాజ్, ఫైనాన్స్ డైరెక్టర్ దల్జీత్ సింగ్ కాత్రి, ఏపీ ప్రాంతీయ ముఖ్య అధికారి బీఎస్‌పి మూర్తి, ఏజీఎం (ఎల్) ఎస్.ఎం.శ్రీనివాస్, సీనియర్ మేనేజర్ టి.సుబ్బారావు తదితరులు ఉన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న రాబిన్‌హుడ్ చిత్రబృందం



దుర్గమ్మ సేవలో సంగీత దర్శకుడు తమన్, హీరో నితిన్

కనకదుర్గమ్మను రాబిన్ హుడ్ చిత్ర హీరో నితిన్, దర్శకుడు కుడుముల వెంకీ, నిర్మాత రవిశంకర్‌లు దర్శించుకున్నారు. ఈనెల 28న ఈ చిత్రం విడుదల కానున్నట్టు తెలిపారు. అలాగే సంగీత దర్శకుడు తమన్ దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి అమ్మవారి దర్శనానంతరం పండితులు ఆశీస్సులు, అధికారులు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

తిరుపతమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో మూడోరోజు ఆదివారం ఆలయం భక్తులతో పోటెత్తింది. మునేటిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు ఆదివారం ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున బారులుతీరారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలిచైర్మన్ జంగాల శ్రీనివాసరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జగ్గయ్యపేట సీనియర్ సివిల్‌జడ్జి శ్రావణి కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. గుంటూరుకు చెందిన ఎ.గాయిత్రీ-వెంకటేశ్వరరావులు రూ.50,116లు, విద్యానగర్‌కు చెందిన యలమంచి వెంకట మోహన్-లక్ష్మీకుమారిలు రూ.10,116లు అందజేశారు.



పూజలు చేస్తున్న న్యాయాధికారి శ్రావణి కుటుంబసభ్యులు

వైభవంగా ఇనుప ప్రభోత్సవం



తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి ఇనుప ప్రభోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ఈవో బీ.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలతో ఇనుప ప్రభ ఎక్కించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రభోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తహసీల్దార్ శాంతి లక్ష్మి, ఏసీపీ తిలక్, ఆర్డీవో బాలకృష్ణ ఈఈ రమా, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఎస్సై ఎమ్ఎస్‌కే అర్జున పోలీస్‌బందోబస్తును నిర్వహించారు.



డార్మెటరీ దాతలతో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన చిన్నం నరేష్ కుటుంబసభ్యులు సుమారు కోటిరూపాయలతో డార్మెటరీని నిర్మించగా.. దేవస్థానం నిధులు రూ.5 కోట్లతో కేశ ఖండనశాల, టాయిలెట్ బ్లాక్‌ను ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ప్రారంభించారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ఈవో కిషోర్ కుమార్, ఈఈ ఎల్.రమా, టీడీపీ మండల అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య, గింజుపల్లి గోపి, కల్లూరి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని పల్లకీ ఉత్సవం

నెమలి(గంపలగూడెం) మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు స్వామికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో నిత్యహోమం, బలిహరణ, సువర్ణోత్సవములు, వసంతోత్సవం, పూర్ణాహుతి, చక్రస్నానం, రాత్రి తెప్పోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ నేల సంధ్య, ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, టీడీపీ నాయకులు బెల్లం మధు, మనమ చినబాబు తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామికి చక్రస్నానం

నవరసభరితం.. లవకుశ నాటకం

విజయవాడ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సురభి ప్రదర్శించిన 'లవకుశ' నాటకం నవరస భరితంగా సాగింది. దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం (తంజావూర్) ఆరు రోజులు పాటు నిర్వహిస్తున్న సురభి సంస్థ నాటక మహోత్సవాలలో భాగంగా రెండో రోజు శనివారం సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో లవకుశ నాటకం ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి అధ్వర్యంలో నల్గొండ జిల్లాకు చెందిన శ్రీ శారద విజయ నాట్యమండలి, జనగాం జిల్లాకు చెందిన భానోదయ నాట్యమండలి సంస్థల బృందాలు సంయుక్తంగా ఈ నాటకాన్ని ప్రదర్శించాయి. వాల్మీకి ఆశ్రమ దృశ్యాలు, లవకుశ బాల్యం, శ్రీరాముని వైభవ గీతాలు నాటకానుభూతిని మరింత మధురంగా తీర్చిదిద్దాయి. రంగస్థల అలంకరణ, వేషధారణ, సంగీతం ప్రేక్షకులను అబ్బురపరిచేలా ప్రదర్శించారు.

అశ్వమేధ యాగ ఘట్టం హైలైట్

నాటకంలోని ప్రధాన ఘట్టం అశ్వమేధ యాగం. శ్రీరాముని ఆజ్ఞతో సాగిన యాగాన్ని లవకుశలు అడ్డుకోవడం, అనంతరం వారితో అయోధ్య సైన్యం జరిగిన ఘర్షణ, యుద్ధ సన్నివేశం, శ్రీరామ-లవకుశ మధ్య సంభాషణలు, సీతామాత త్యాగం, ధర్మ విజయం చివరకు వారి అసలు నిజం వెల్లడయ్యే తీరు ప్రేక్షకుల హృదయాలను హత్తుకొనేలా చేశాయి.

సాంకేతిక విన్యాసాలు, నాటక ప్రాముఖ్యత ఈ నాటకాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దడానికి సురభి సంస్థ ఆధునిక సాంకేతికతను వినియోగించింది. లైటింగ్స్, ధ్వని, విజువల్ ఎఫెక్ట్స్ మిశ్రమంగా వినిపించి, వాయుదేవుడి ప్రయాణం, అరణ్య రమణీయత, గంధర్వగానం ఈ అంశాలు నాటకానికి మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. వశిష్ఠునిగా శివశంకర్, శ్రీరామునిగా ఆర్.నాగబాబు, లక్ష్మణునిగా ఆర్.భానుప్రసాద్, భరతునిగా ఆర్.కుమార్, శత్రుఘ్నగా ఆర్.మాధవరావు, ఆంజనేయుడిగా - ఆర్.పూర్ణేష్, వాల్మీకిగా ఎ.వెంకటేశ్వరప్రసాద్, సీతాదేవిగా ఎస్సీ హేమమాలిని, భూదేవిగా ఆర్.హరిణి, లవునిగా జాహ్నవి, వి.తనూజ, భాను, కుశునిగా హేమస్వి సంతోషి, హరి శివకృష్ణలు చక్కని నటనతో చక్కని పద్య గానంతో, లాలిత్యమైన అభినయంతో అలరించారు.







లవకుశ నాటకంలో సన్నివేశాలు



నార్తువల్లూరు క్వారీ వద్ద ఇసుక ఓవర్‌లోడు లారీ

ఇదిగో.. ఓవర్ లోడు!

» పట్టని అధికారులు

తోట్లవల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఇసుక క్వారీలపై అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్వారీల్లో తవ్వకాలలో నిబంధనలు పాటిస్తున్నారా.. లారీల్లో ఎంత లోడు వేస్తున్నారు అనే అంశాలపై అధికారులు తనిఖీలు చేయటం లేదని విమర్శలు వస్తున్నాయి. తోట్లవల్లూరు(నార్తువల్లూరు), రొయ్యూరులో ఫిబ్రవరి 6తో ఇసుక తవ్వకాల గడువు ముగిశాయి. తరువాత ఫిబ్రవరి 19 నుంచి జూలై 14 వరకు క్వారీలను జిల్లా శాండ్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రెన్యువల్ చేస్తూ తవ్వకాలకు అనుమతిచ్చారు. ఇసుక క్వారీల్లో నిబంధనలు పాటించడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. లారీల్లో ఓవర్ లోడింగ్ వస్తుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేసి నిబంధనలు అమలయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అమరజీవి త్యాగం అజరామరం

» పొట్టి శ్రీరాములుకు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాళి

మచిలీపట్నం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం మరువలేమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అమరజీవి జయంతి సందర్భంగా ఆదివారం కృష్ణా జిల్లా కోర్టుసెంటర్‌లోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి మంత్రి రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కూటమి నేతలు కొనకళ్ల బుల్లయ్య, మోటమర్రి బాబాప్రసాద్, సన్నిధి నాగసాయి, వేము కోటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేశారన్నారు. ఆయన త్యాగ ఫలితంగా ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. కొనకళ్ల బుల్లయ్య మాట్లాడుతూ, గాంధీ కంటే ముందుగా దళితుల హక్కుల కోసం పొట్టి శ్రీరాములు పోరాడారన్నారు. దళితులకు ఆలయాల్లో ప్రవేశం కల్పించారన్నారు. కార్యక్రమంలో బచ్చుల బోసుబాబు, గుమ్మడి విద్యాసాగర్, బొడ్డు శ్రీనివాస్, గడ్డం రాజు, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగరాము తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బాలాజీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ బాలాజీ

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

» కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్ : తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం చాలా గొప్పదని, ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాముల త్యాగనిరతిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రేమ, నిస్వార్థంతో కూడిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత గొప్ప వ్యక్తుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయికి చేరేందుకు కృషిచేయాలని సూచించారు.



వేగంగా..

(5వ పేజీ తరువాయి)

కొద్దిరోజుల్లోనే ప్రారంభంకానున్నాయి. రాష్ట్ర విభజనకు ముందే కేంద్ర ప్రభుత్వం ఈ మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌ను మంజూరు చేసింది. అప్పట్లో నాగాయలంక మండలం గుల్లలమోద ఆమోదయోగ్యమైనదిగా నిర్ణయించారు. గుల్లలమోద సముద్రతీర ప్రాంతాన్ని కలిగి ఉండటం వల్ల మిస్సైల్స్ టెస్టింగ్ చేసిన క్రమంలో శకలాలు సముద్రంలో పడిపోతాయి. పర్యావరణానికి కూడా విఘాతం ఉండదని అప్పట్లో నిర్ణయించారు. ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు. రాష్ట్ర విభజన జరిగాక గతంలోని టీడీపీ ప్రభుత్వం చొరవ కారణంగా గుల్లలమోదలో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌కు సంబంధించి కదలిక వచ్చింది. 381 ఎకరాలను కేటాయించారు. భూములు కేటాయించిన ప్రాంతంలో మడ అడవులు ఉండటంతో పర్యావరణకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత మడ అడవులకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తిరిగి భూములు కేటాయించటం వల్ల సమస్య తొలగింది. ఇటీవల కాలంలో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ పరిపాలనా భవనం పనులు పూర్తయ్యాయి. కాంపౌండ్ వాల్, గ్రాండ్ ఎంట్రన్స్ మార్గాలను అభివృద్ధి చేశారు. మిస్సైల్ టెస్టింగ్‌కు సంబంధించిన మిగిలిన విభాగాలను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక్కడకు మిస్సైల్స్ తరలించి పరీక్షించటమే తరువాయి.

నేటి నుంచి పది పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

సెంటర్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను గంట ముందే అనుమతించనున్నారు.

ఆరు సమస్యాత్మక కేంద్రాలు

కృష్ణాజిల్లాలో అవనిగడ్డ, డోకిపర్రు, గన్నవరం మండలం ముస్తాబాద, కంకిపాడు మండలం పునాదిపాడు, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి, బందరు మండలం తాళ్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో విద్యా, పోలీసు, వైద్య ఆరోగ్య, ఆర్టీసీ, పంచాయతీ రాజ్ శాఖలను భాగస్వామ్యం చేశారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు.



స్వచ్ఛ చల్లపల్లి గ్లోసైన్ బోర్డు వద్ద డాక్టర్ డీఆర్కే, పద్మావతి దంపతులతో వైద్యుల బృందం

డాక్టర్ డీఆర్కే దంపతుల సేవలు స్ఫూర్తిదాయకం

» స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన వైద్యుల బృందం

చల్లపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ చల్లపల్లిలో వైద్య దంపతుల సేవలు స్ఫూర్తిదాయకమని వైద్యులు ప్రశంసించారు. డాక్టర్లు డీఆర్కే ప్రసాద్, పద్మావతి దంపతుల నేతృత్వంలో జరుగుతున్న స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమ ప్రస్థానాన్ని పరిశీలించేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యుల బృందం చల్లపల్లి వచ్చారు. ఆదివారం ఉదయం కార్యకర్తలతో కలిసి స్వచ్ఛసేవలందించారు. పదేళ్లలో చల్లపల్లిలో అభివృద్ధి చెందిన ప్రాంతాలు, సుందరీకరణ ప్రదేశాలను సందర్శించారు. 2014లో స్వచ్ఛ చల్లపల్లి ప్రారంభం నాటినుంచి నేటివరకూ అభివృద్ధి విశేషాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డీఆర్కే దంపతులు వైద్యమిత్రులకు వివరించారు. డాక్టర్లు ఎల్.మురళీధర్(వనపర్తి), జి.సుధాకర్‌రెడ్డి(ఆత్మకూరు), జీవనజ్యోతి, ముప్పా రామారావు(మిర్యాలగూడ), బ్రహ్మారెడ్డి(కర్నూలు), మహ్మద్ అబ్దుల్ సత్తార్(వనపర్తి), మహ్మద్ అఫ్జలుద్దీన్(వనపర్తి), సురేష్(పామర్రు), సాంబిరెడ్డి(తెనాలి), కాలేషా(నెల్లూరు), కెవి.శేషారెడ్డి(ఆత్మకూరు), కె.నాగేశ్వరరావు(ఒంగోలు), ప్రసాద్(ఆత్మకూరు) తదితరులు స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన వారిలో ఉన్నారు.

రేపట్నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడలు

» ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

విజయవాడ (స్పోర్ట్స్),మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఈ నెల 18 నుండి విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం స్టేడియంలో క్రీడా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం శాసనసభ సంస్కృతి సాంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు మళ్లీ పాత సాంప్రదాయానికి స్వాగతం పలకటం గొప్ప నిర్ణయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని జీవీ అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అందరినీ పోటీలకు ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. 12 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని, 20న బెర్మ్ పార్క్‌లో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎల్‌ఏ సెక్రటరీ ప్రసన్నకుమార్ టీడీఎల్‌పీ ఇన్‌చార్జ్ కోనేరు సురేష్, శాప్ ఏవో వెంకట రమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



టెన్నిస్ కోర్టును పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు, యార్లగడ్డ వెంకట్రావు

బస్సుల్లేవ్!

(5వ పేజీ తరువాయి)

ఆగిపోయేవి. గత నాలుగేళ్లుగా కనుక చూస్తే రోడ్ల మీద బస్సులు ఆగిపోవటం సర్వసాధారణంగా మారిపోయింది. నగరంలో సిటీ బస్సులు తగిన సంఖ్యలో లేకపోవటం, ఉన్న బస్సులు కూడా కండీషన్‌లో ఉండకపోవటంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు.

లక్షన్నర నుంచి 78 వేల కిలోమీటర్లకు తగ్గిన షెడ్యూల్

ఆర్టీసీ సిటీ బస్సులు తగ్గడం వల్ల రోజువారీ తిరిగే కిలోమీటర్ల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. పూర్వం రోజుకు లక్షన్నర కిలోమీటర్లు షెడ్యూల్‌గా ఉండేది. ఖచ్చితంగా అన్ని కిలోమీటర్ల మేర బస్సులు తిరగాలి. ఇంతకంటే ఎక్కువ కూడా తిరిగేవి. బస్సులు తక్కువగా ఉండటం వల్ల ప్రస్తుతం కేవలం 87 వేల కిలోమీటర్లు ఖచ్చితంగా తిరగాలని షెడ్యూల్‌ను మార్చారు. అయినా కూడా 78 వేల కిలోమీటర్లు మాత్రమే బస్సులు తిరుగుతున్నాయి. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కూడా తిరగటం లేదు. దీనికి ప్రధానంగా ఆర్టీసీ అధికారులు ట్రిప్పులను తగ్గించటమే కారణమని తెలుస్తోంది. ప్రయాణికులు ఆదరించటం లేదన్న కారణంతో రెండు మూడేళ్లుగా ఆర్టీసీ అధికారులు ట్రిప్పులను రద్దు చేస్తున్నారు. దీంతో షెడ్యూల్ కిలోమీటర్లు కూడా తిరగని పరిస్థితి ఏర్పడింది.

పడిపోయిన ఈపీకే

ఆర్టీసీ బస్సులు తగ్గిపోవటం, షెడ్యూల్ కిలోమీటర్లు కూడా తిరగని కారణంగా ఆర్టీసీ బస్సుల ద్వారా ఆదాయం గణనీయంగా పడిపోయింది. నగరంలోని సిటీ బస్సులన్నింటికీ కలిపి సగటున కిలోమీటరుకు వచ్చే ఆదాయం(ఈపీకే) కూడా తగ్గిపోయింది. పూర్వం కిలోమీటరుకు రూ.50 నుంచి రూ.60 మధ్యన ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ. 44.32లకు పడిపోయింది.

గణనీయంగా తగిన ఓఆర్

తగ్గిన సిటీ బస్సుల సంఖ్య బస్సుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)పై కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఎన్టీఆర్ రీజియన్‌లో మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల ద్వారా 79 శాతం ఓఆర్ వస్తుండగా, సిటీ ఆర్డినరీల ద్వారా 47 శాతం ఓఆర్ వస్తోంది. ఈరెండింటినీ కలిపితే 59 శాతం ఓఆర్ మాత్రమే వస్తోంది. ఒకప్పుడు 70 శాతం నుంచి ప్రస్తుతం 59 శాతానికి ఓఆర్ పడిపోవటం ఆర్టీసీ దీనస్థితిని తెలియచేస్తోంది.

ఆటోల వైపు ప్రయాణికుల చూపు

నగర ప్రజల రవాణా అవసరాలకు తగినన్ని సిటీ బస్సులు లేకపోవటంతో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ సిటీ ఆపరేషన్‌కు సంబంధించి చూస్తే సబర్బన్ పరిధి విజయవాడ నుంచి మైలవరం, విజయవాడ నుంచి నూజివీడు, విజయవాడ నుంచి హనుమాన్‌జంక్షన్, విజయవాడ నుంచి కంకిపాడు దాటి ఉయ్యూరు వరకు విజయవాడ నుంచి అమరావతి, విజయవాడ నుంచి మంగళగిరి వరకు ఉంది. ఇంత పెద్ద సబర్బన్‌ను పెట్టుకుని తగిన సంఖ్యలో బస్సులు లేకపోవటంతో ఆయా ప్రాంతాల నుంచి విజయవాడ రావటానికి ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లను ప్రజలు పెద్ద ఎత్తున ఆదరిస్తున్నారు. దీంతో నగరంలో పరిమితికి మించి అర లక్ష వరకు ఆటోలు నడుస్తున్నాయి. ఆర్టీసీ దగ్గర బస్సులు తగ్గిపోవటం వల్ల ఏర్పడిన సమస్య ఇది.

విద్యుత్ సర్వీసులొస్తే మెరుగుకానున్న పరిస్థితి

నగర జనాభా అవసరాలకు తగిన విధంగా బస్సులు లేకపోవటం వల్ల ప్రయాణికులు క్రమేపీ ఆర్టీసీకి దూరమవుతున్నారు. ఇది ఆర్టీసీ భవిష్యత్తుకు ఏమాత్రం మంచిది కాదు. ఇలాంటి సమయంలో ఆర్టీసీకి అత్యాధునిక నూతన సిటీ బస్సులను యుద్ధ ప్రాతిపదికన ప్రవేశపెట్టడం అవసరం. సిటీ బస్సులుగా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టే దిశగా అడుగులు పడుతున్నా.. ఇంకా కార్యరూపంలోకి రాలేదు. దాదాపుగా విజయవాడకు 100 సిటీ బస్సుల వరకు వచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదనలు అయితే కేంద్రానికి పంపారు కానీ, దీనిపై ఇంకా పూర్తి స్థాయిలో కదలిక ప్రారంభం కాలేదు. విద్యుత్ బస్సులు వస్తే ఆర్టీసీ నగరంలో బతకటానికి అవకాశం ఉంటుంది.

వీడని గ్రహణం

(5వ పేజీ తరువాయి)

తమకు కేటాయించిన పంచాయతీల వైపు కన్నెత్తి చూడనిపరిస్థితి.

మచిలీపట్నం మండలంలో ప్రతిపాదిత గ్రామాలు

మచిలీపట్నం మండలంలోని అరిసేపల్లి, పోతేపల్లి, మేకావానిపాలెం, కరగ్రహారం, చినకరగ్రహారం, గరాలదిబ్బ, రుద్రవరం, ఎస్ఎన్‌గొల్లపాలెం, సుల్తానగరం పంచాయతీలను మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో కలిపేందుకు గతంలో ప్రతిపాదనలు చేశారు. ఈ తొమ్మిది పంచాయతీలను మునిసిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండటంతో 2021లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగిన సమయంలో మచిలీపట్నం మండలంలో జెడ్పీటీసీ స్థానంతో పాటు, 20 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలను కూడా నిలిపివేశారు. మచిలీపట్నం మండల పరిషత్‌లో పాలకవర్గం ఏర్పాటుకు సంబంధించి ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు జరగలేదు. జెడ్పీటీసీ స్థానానికి కూడా ఎన్నికలు నిర్వహించలేదు. జిల్లా పరిషత్‌లో మచిలీపట్నం మండలం నుంచి జెడ్పీటీసీ సభ్యుడి ప్రాతినిధ్యం లేకుండానే నాలుగేళ్లు గడచిపోయాయి. రెండేళ్ల క్రితం మచిలీపట్నం నియోజకవర్గంలో ఉన్న ఒకే మండలాన్ని మచిలీపట్నం నార్త్, మచిలీపట్నం సౌత్ మండలాలుగా విభజించారు. ఇద్దరు తహసీల్దార్‌లు పనిచేస్తున్నారు. కానీ మండల పరిషత్ మాత్రం ఒక్కటే కొనసాగుతోంది. ప్రత్యేక గెజిట్ ద్వారా మచిలీపట్నం మండలాన్ని అధికారికంగా రెండుగా విభజించిన నేపథ్యంలో రెండు జెడ్పీటీసీ స్థానాలు, రెండు మండల పరిషత్‌లుగా విభజిస్తారా లేదా అనే అంశంపైన అధికారుల వద్ద స్పష్టతలేదు.

గుడివాడ నియోజకవర్గంలో వింత పరిస్థితి

గుడివాడ నియోజకవర్గం గుడ్లవల్లేరు మండలంలోని గుడ్లవల్లేరు, కూరాడ, కౌతవరం పంచాయతీలను కలిపి గుడ్లవల్లేరు నగర పంచాయతీగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన గతంలో పెట్టారు. ఈ అంశంపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ మూడు పంచాయతీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. గుడివాడ మండలంలోని లింగవరం, వలివర్తిపాడు, మల్లాయపాలెం, బొమ్ములూరు, బిళ్లపాడు, పెదపారుపూడి మండలం భూషణగుళ్ల పంచాయతీలను గుడివాడ పురపాలక సంఘంలో విలీనం చేసేందుకు గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గుడివాడ మండలంలోని పంచాయతీలను పురపాలక సంఘంలో విలీనం చేయవద్దని కొందరు కోర్టును ఆశ్రయించడంతో గుడివాడ పురపాలక సంఘం ఎన్నికలు నిలిపివేశారు. నేటికీ గుడివాడ పురపాలక సంఘంలో పాలకవర్గం లేకపోవడంతో ప్రత్యేక అధికారి పాలనలోనే కొనసాగుతోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 425

మల్లవల్లి పారిశ్రామికవాడ పరిశీలన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అశోక్ లేలాండ్ కంపెనీ ప్రారంభోత్సవానికి మంత్రి నారా లోకేశ్, కంపెనీ చైర్మన్ రానున్న నేపథ్యంలో సీఐ సత్యనారాయణ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అధికారిక సమాచారం అందలేదని, ఉన్నతాధికారుల సూచన మేరకు పారిశ్రామికవాడ పరిసరాలను పరిశీలించినట్టు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి ఎస్సై శ్రీనివాస్, అశోక్‌లేలాండ్ ప్రతినిదులు పాల్గొన్నారు.



మల్లవల్లి పారిశ్రామికవాడను పరిశీలిస్తున్న పోలీసులు

శివాలయం అభివృద్ధికి విరాళం

హనుమాన్‌జంక్షన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపులపాడు ధర్మ కోనేరు వద్ద వేంచేసి ఉన్న బ్రహ్మసూత్ర మరకత లింగ శివాలయం అభివృద్ధికి బొమ్ములూరు గ్రామానికి చెందిన ముసునూరి శ్రీనివాసరావు పద్మజ దంపతులు రూ.5లక్షలు విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నాకు దాతలు విరాళం అందించారు. ఈ సందర్భంగా దంపతులను ఆలయ కమిటీ అభినందించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వీర మాచనేని నాగయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్ ఉన్నారు.



రామాలయం పునః నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్

రామాలయ పునఃనిర్మాణానికి..

కంకిపాడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలవెన్ను ఎస్సీ కాలనీలో కోదండ రామాలయం పునఃనిర్మాణానికి కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామాలయ పునః నిర్మాణానికి గ్రామస్థులు ముందుకు రావడం హర్షణీయ మన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కొప్పుల లాజర్, ధనలక్ష్మి, శీలం జగన్, దోమవరపు మల్లికార్జున్ గుంటూరు శివలక్ష్మి, కొప్పుల వంశీ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థినికి ప్రోత్సాహకం

ఉయ్యూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితయ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న పెనుమూడి లతికకు లయన్స్‌క్లబ్ జోనల్ చైర్‌ప ర్సన్ ఎండీ ఇస్మాయిల్ రూ. 5,500 నగదు ప్రోత్సాహక బహుమతి ఆదివారం అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989-1990 సంవత్సరం పదవతరగతి విద్యార్థుల మిత్రబృందం ఆధ్వర్యంలో ఇస్మాయిల్‌కు రంజాన్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. పూర్వ విద్యార్థుల స్నేహపూర్వక కలయిక సందర్భం గా చిన్న సేవా కార్యక్రమం చేశామని మిత్రబృందం తెలిపింది. చంద్రశేఖర్, హేమంత్, కరీముల్లా, రామాంజనేయులు, ప్రకాశ్ తదితరులు ఇస్మాయిల్‌ను అభినందించారు.



దయారా మసీదులో..

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఉయ్యూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ ఉపవాసమాసం పురస్కరించుకుని దయారా మసీదులో ఆదివారం ఏఎంసీ మాజీ చైర్మన్ అబు కలాం సోదరులు ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఉపవాసం ఉన్నవారు దీక్ష అనంతరం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఇఫ్తార్ విందు ఇవ్వడం ఎంతో సంతోషకరంగా ఉందని అబు కలాం అన్నారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. నగర పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, జలీల్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్ తదితరులు పాల్గొని సేవలందించారు.

వ్యవసాయ వినియోగానికి విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఉయ్యూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ముదునూరు సబ్‌స్టేషన్‌లో 33/11లో 33 కేవీ ఫీడరుకు మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ముదునూరు, బోళ్లపాడు, సాయిపురం, జబర్లపూడి గ్రామాల పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ వినియోగ దారులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. అదేవిధంగా గృహ వినియోగ దారులకు కూడా అప్పుడప్పుడూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చని తెలిపారు.

తాగునీటి ఎద్దడి తీర్చాలి

గన్నవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం దళితవాడలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లం పల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం దళితవాడలో ఆదివారం నిర్వహించారు. ఇళ్లకు వెళ్లి ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా మంచి నీళ్లు రావడం లేదని, రెండు రోజులకు ఓసారి నీళ్లు వస్తున్న పరిస్థితి ఉందని మహిళలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరగాని సాంబశివరావు, జాస్తి శ్రీనివాసరావు, చిటికెల రాజేశ్వరరావు, ఉడతా రామకృష్ణ పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

జటిలం!

- బాపులపాడు మండలంలోని బొమ్ములూరు, ఆరుగొలను, తిప్పనగుంటలో శిథిలావస్థకు చేరుకున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు
- బండారుగూడెంలో మరమ్మతులకు నోచుకోని చేతిపంపు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో మొదలైన దాహం కేకలు

(హనుమాన్‌జంక్షన్‌రూరల్ - ఆంధ్రజ్యోతి)

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సురక్షిత జలం అందించేందుకు ఏర్పాటు చేసిన సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. బాపులపాడు మండలంలోని బొమ్ములూరు, ఆరుగొలను, తిప్పనగుంట తదితర గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు కొన్ని శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేస్తూ కాలం నెట్టుకొస్తున్నారు. ఇప్పటికే బండారుగూడెం లాంటి గ్రామాల్లో మరమ్మతులు చేయించాలని మహిళలు నిరసన తెలిపేందుకు రోడ్డెక్కారు. అన్ని గ్రామాల్లో తాగునీరందిస్తామని ప్రగల్భాలు పలికిన మాజీ ఎమ్మెల్యే వంశీ చాలా చోట్ల శిలాఫలకాలు ఆవిష్కరించడంతోనే ఆగిపోయాయి. వేలాది మందికి తాగునీరందించే సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకోవడం ఏలాగో తెలియని స్థితిలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


● ఆరుగొలనులో ఫిల్టర్ బెడ్‌లలో పొదలు పెరిగిపోయి, నాచు పట్టి చూసేందుకు భీతిగొలిపేలా తయారయ్యాయి. ఓవర్ హెడ్ ట్యాంకు పైకప్పు కూలిపోయినా, పైప్‌లైన్లు విరిగి పోయినా ప్రజల సౌకర్యార్థం ఆదే వాటర్ ట్యాంకుకు మోటారు నుంచి డైరెక్ట్ పైపు లైను ద్వారా నీరు నింపుతున్నారు. నీటి సరఫరా ఫిల్టర్ బెడ్లను ఉపయోగిస్తే ఆనీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడతారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

● బండారుగూడెం ఎస్సీ కాలనీకి నీటిని అందించే చేతిపంపు మరమ్మతుకు రావడంతో జనవరి నెలలోనే మహిళలు నిరసన తెలిపారు.

● బొమ్ములూరులోని కొయ్యూరు రోడ్డులోని వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకున్నా పంచాయతీ వారు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంకు స్థానే నూతనంగా నిర్మించాలని టీడీపీ నాయకుడు గండేపూడి నితీష్‌కుమార్ జూలైలో వినతిపత్రం అందజేశారు.



ఫిల్టర్ బెడ్‌లో పెరిగిన జమ్ము



ఆరుగొలనులో శిథిలమైన వాటర్ ట్యాంకు

● తిప్పనగుంటలో సుమారు 40ఏళ్లకు పైగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ఫిల్టర్‌బెడ్‌లు పనిచేయక పోవడంతో చెరువులోని నీరు డైరెక్ట్‌గా ఇంటింటి చేరే విధంగా పైప్‌లైన్లలోకి వదిలేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. కొన్నిసార్లు బురదనీరు కూడా వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మల్లవల్లిలోను దాదాపు ఇదే స్థితిలో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లులో సుమారు రూ. 18 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల వైసీపీ హయాంలో అవినీతి, అక్రమాలు మినహా చేసిందేమీ లేదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 4500 కోట్లతో రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు అభివృద్ధి చెందాయన్నారు. ఒక్క పెనమలూరు నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు సుమారు రూ. 50 కోట్లతో అభివృద్ధి చేశామని, అదే విధంగా ఈడుపుగల్లు గ్రామ పరిధిలోనే ఎన్‌ఆర్‌ఈజీఎస్, జనరల్ ఫండ్స్ నిధులు రూ. 2 కోట్లతో రహదారులు, డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తి చేశా మన్నారు. మండలంలోనే ఈడుపుగల్లు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయిలో తన వంతు సహకరి స్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, సీహెచ్‌సీ డైరెక్టర్ గరికిపాటి రవికిషోర్, ఈవో చింతా కిరణ్‌కుమార్, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, టీడీపీ నాయకులు రావి సురేష్ బాబు, షేక్ మాబు సుబాని, పుట్టగుంట రవి, కాకుళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎంపీపీ దేవినేని రాజా

గ్లకోమా వ్యాధిపై అవగాహన వాక్

పెనమలూరు : తాడిగడప ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిలో నిరంతర వైద్యశిబిరాలు, వర్కుషాపుల్లో కంటి వ్యాధులు ఉన్నవారు వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం గ్లకోమా అవగాహన వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వైద్యులతో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మయాంక్ రాయ్ మాట్లాడుతూ, కంటి వ్యాధుల్లో గ్లకోమా తీవ్రమైనదని, గ్లకోమా సోకితే అంధత్వం సంభవించే ప్రమాదం ఉందని ప్రపంచ వ్యాప్తంగా గ్లకోమా ఉన్నవారి సంఖ్య ఎనభై మిలియన్లుగా తెలిపారు. వ్యాధి ముదిరే వరకు లక్షణాలు కనిపించవని, గ్లకోమా తీవ్ర దశకు వచ్చే వరకు లక్షణాలు కనపడకపోవడంతో చికిత్స చేయని పక్షంలో గ్లకోమా అంధత్వానికి దారి తీయవచ్చని తెలిపారు. ఈ వాక్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో పాటు తాడిగడప టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తుమ్మల రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

హనుమాన్‌జంక్షన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం సాధించడానికి ప్రాణాలు త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అందించిన స్ఫూర్తి ఆదర్శనీయమని ఆర్య వైశ్యసంఘం బాపులపాడు మండల అధ్యక్షుడు కొనకళ్ల రాజశేఖర్ తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా బాపులపాడు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో జయంతిని నిర్వహించారు. శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి జిల్లా కోశాధికారి మిట్టపల్లి పద్మలలిత, మండల నాయకులు లింగమల రూపశంకర్, గార్లపాటి కాశీవరప్రసాద్, చామర్తి రాంబాబు, బొమ్మిశెట్టి రామారావు, వెచ్చా వెంకటేశ్వరరావు, నారికమల్లి ప్రసాద్, గార్లపాటి రామకృష్ణ, కంభంపాటి శ్రీనివాసరావు, తవ్వా పూర్ణచంద్రరావు, శ్రీదర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగ నిరతి మరువలేనిది

ఉయ్యూరు : తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం నిస్వార్థంగా అంకుటిత దీక్షతో 56 రోజులపాటు నిరవధిక నిరాహార దీక్ష చేసి ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవిగా నిలిచారని పలువురు కీర్తించారు. పొట్టి శ్రీరాములు 124వ జయంతి పురస్కరించుకుని ఆదివారం ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేసన్, ఉయ్యూరు వాకర్స్ అసోసి యేషన్‌ల ఆధ్వర్యంలో శ్రీరాములు చిత్రపటానికి వేర్వేరుగా పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అబ్దుల్ సత్తార్, పూర్ణచంద్రరావు, బాపిరాజు, ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, తిరుమలరావు, రాంబాబు నివాళులర్పించారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉయ్యూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు మండల పరిధిలో సోమవారం నుంచి జరిగే పదవతరగతి పరీక్షలకు ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. 1515 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల, ఫ్లోరా స్కూల్, రవీంద్రభారతి, శ్రీచైతన్యస్కూల్, కాటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన సదుపాయలు కల్పించినట్టు డీవైఈవో పద్మారాణి తెలిపారు.

కంకిపాడు : పది పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో ప్రసాద్ తెలిపారు. కంకిపాడు జడ్పీ పాఠశాలలో పది పరీక్ష కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోమవారం నుంచి జరగనున్న పది పరీక్షలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 463 మంది, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు 1385 మంది, ఫెయిల్ అయిన విద్యార్థులు 95 మంది పరీక్షలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు.



జంక్షన్ రాణమ్మ తల్లి ఆలయంలో ధ్వజ స్తంభం పునఃప్రతిష్ట నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఘనంగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ

హనుమాన్‌జంక్షన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని రాణమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గతంలో ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభం శిథిలం కావడంతో రాతితో తయారు చేసిన ధ్వజ స్తంభం ప్రతిష్ఠించారు. దీంతో పాటు ఆలయ ప్రాంగణంలో రావిచెట్టు కింద వాయాంజనేయ స్వామి విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఆలయ అర్చకులు మురళీశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అన్నే రాంబాబు, నరసింహ, కొయ్యూరు పాలకేంద్రం అధ్యక్షుడు కొల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

● **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** కానుమోలులోని సీతారామస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు శ్రీరామనవమికి నిర్వహించే కల్యాణ మహోత్సవానికి సహకరించాలని గ్రామ ప్రముఖులను ఈవో యార్లగడ్డ వాసు కోరారు. దేవస్థాన ఆవరణలో ఆదివారం స్థానిక ప్రముఖులు, అర్చకులతో సమావేశం నిర్వహించారు. పురాతన దేవస్థానమైన సీతారాస్వామి ఆలయంలో చేయవలసిన అభివృద్ధి పనులు, కల్యాణ మహోత్సవానికి చేయవలసిన ఏర్పాట్లపై చర్చించారు. సహకారమదించేందుకు ప్రముఖులు హామీ ఇచ్చినట్లు ఈవో తెలిపారు.



ద్వారకా తిరుమలకు కూరగాయలు పంపిస్తున్న భక్తులు

ద్వారకా తిరుమలకు కూరగాయలు అందజేత

గన్నవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా తిరుమలలోని శ్రీవారి సన్నిధిలో జరిగే నిత్య అన్నసమారాధనకు గ్రామస్తులు 3,500 కిలోల కూరగాయలను ఆదివారం స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నుంచి పంపించారు. కూరగాయల లోడుతో వెళుతున్న వాహనానికి హిందూ ధార్మిక మండలి నాయకులు నెక్కలపూడి ఈశ్వరరావు, మండవ వెంకట ప్రభాకరరావు, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ, తిరుమల తిరుపతి దేవస్థానానికి తిరుమల తిరుపతి దేవస్థానానికి 11 టన్నులు, శ్రీశైలం ఆలయానికి నాలుగు టన్నులు కూరగాయలను గన్నవరం నుంచి పంపించామని చెప్పారు. తొలిసారిగా ద్వారకా తిరుమలకు కూరగాయలను పంపించామన్నారు. తుమ్మల మురళీకృష్ణ కాసన్నేని బాబూరావు, కొణసాని నాగేశ్వరరావు, కాసన్నేని శ్రీనివాసరావు, చిలకపాటి సీతారామయ్య, తుమ్మల జితేంద్ర, ఆలయ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్

గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

మండల సమావేశంలో వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్

గన్నవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం కార్యాలయంలో జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను అధికారులు వివరించారు. జడ్పీటీసీ ఎలిజబెత్ రాణి బూతి మిల్లిపాడు, అజ్జంపూడి గ్రామాల్లో పనులకు ప్రాధాన్యత ఇస్తే బాగుండేదన్నారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ మాట్లాడుతూ, మండల పరిషత్‌లో ఎంపీటీసీ సభ్యులు చెప్పిన పనులు మాత్రమే గ్రామాల్లో జరుగుతున్నాయన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ రాజు మాట్లాడుతూ, మండలంలో 34వేల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయని, 14 మంది స్టాఫ్ వర్క్ చేస్తున్నారని చెప్పారు. 34 మంది వర్కర్లు కావాల్సి ఉండగా 14 మంది ఉండటంతో వారితోనే పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. వీఎస్‌పురం కాలనీలో కరెంట్ సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎంపీటీసీ రంగారావు జోక్యం చేసుకుని సావరగూడెంలో కరెంటు వైర్ల చోరీపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంపీడీవో స్వర్ణలత ఎస్సీ, బీసీ, మైనార్టీలకు లోన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ శివనాగరాజుకుమారి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 425

అక్రమ తవ్వకాలను నిరోధించాలని ఆందోళన

తోట్లవల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : భద్రిరాజుపాలెం బీసీ ఫీల్డు లేబర్ సొసైటీ భూముల్లోని బుసకమట్టిని కొందరు తమకు తెలియకుండా అక్రమంగా రాత్రి సమయంలో తవ్వేశారని ఆ సొసైటీ సభ్యులు వెంకట సుబ్బారావు ఆరోపించారు. గ్రామస్థుల సమాచారం మేరకు సొసైటీ సభ్యులు చాగంటిపాటి సుబ్బారావు, ఎం కోటేశ్వరరావు, వేములమడ సాంబశివరావు, ముట్టుకూరి రామలింగం, జక్కా శివరామకృష్ణ పలువురు మహిళలు ఆదివారం ఉదయం సొసైటీ భూముల వద్దకు వచ్చి తవ్వకాల ప్రదేశాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు నిఘాపెట్టి బుసకమట్టి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు.


ఆందోళన చేస్తున్న బీసీ సొసైటీ సభ్యులు

పది పరీక్షలకు సర్వంసిద్ధం


మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పరీక్ష హాలును పరిశీలిస్తున్న ఎంఈవో బాలాజీ

గుడివాడ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్, అర్బన్ ప్రాంతాల్లో పదో తరగతి పరీక్షకు 2900 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు ఎంఈవో బాలాజీ తెలిపారు. ఈ సదర్భంగా ఆదివారం ఆయన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం సకల ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, ప్రాథమిక చికిత్స ఏర్పాట్లకు ఏఎన్‌ఎంలను నియమించామన్నారు. ప్రతీ సెంటర్‌లో పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయాన్ని ఆదివారం పది వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు ఆలయ పాల పొంగళ్ల పాకశాలలో పాల పొంగళ్లు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్నందున పదో తరగతి విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నందివాడ : పదోతరగతి పరీక్షలు మొదలు కావటంతో పరీక్షా సెంటర్ల వద్ద విద్యార్థులకు అన్ని వసతులు , పోలీస్ బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు మండల ఎంఈవో-2 డేవిడ్ రత్నరాజు తెలిపారు. ఈ సందర్భంగా మండల వారీగా పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు 331 మంది ఉన్నారన్నారు. మూడు పరీక్షా కేంద్రాలలో '(నందివాడ, రుద్రపాక, వెన్ననపూడి) పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

పామర్రు: పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు సంబంధిత పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి చేరుకోవాలని పామర్రు మండల విద్యాశాఖ అధికారిణి గుమ్మడి పద్మవాణి సూచించారు. పామర్రులో సోమవారం నుంచి జరగనున్న ఐదు పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 759 మంది ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల నుంచి పరీక్షలకు విద్యార్థులు హాజరుకానున్నట్టు చెప్పారు. విద్యార్థులు పరీక్షల పట్ల ఎలాంటి ఆందోళనకు లోనవకుండా పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.


వేమవరం కొండాలమ్మ ఆలయంలో క్యూలైన్లలో వేచియున్న పదో తరగతి విద్యార్థులు


పరీక్షలకు సిద్ధమైన పామర్రు జెడ్పీ హైస్కూల్

పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలో సోమవారంనుంచి జరిగే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు డీవైఈవో పద్మారాణి తెలిపారు. తాడంకి, కపిలేశ్వరపురం, పమిడిముక్కల, మేడూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 480మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్టు ఆమె తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

పెదపారుపూడి : పెదపారుపూడి మండల పరిధిలోని వెంట్రప్రగడ, యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. మార్చి 17 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 1వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయని మండల విద్యాశాఖాధికార బొడ్డు శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 నిముషాల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. యలమర్రులో బాలురు 19 మంది, బాలికలు 22 మంది, పెదపారుపూడి బాలురు 15 మంది, బాలికలు 20 మంది, వానపాముల బాలురు 16 మంది, బాలికలు 14 మంది, వెంట్రప్రగడ బాలురు 32 మంది, బాలికలు 20 మంది, దోసపాడు బాలురు 13 మంది, బాలికలు 12 మంది మొత్తం 196 మంది పరీక్షలు హాజరవుతారని ఆయన తెలిపారు.


వైద్యసేవలందిస్తున్న పిన్నమనేని మెడికల్ ఆస్పత్రి వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

గుడివాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో కీర్తిశేషులు డాక్టర్ లక్ష్మీపెరుమాళ్లు, ప్రభావతి, చలసాని రాయన్‌చౌదరిల జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. చినఅవుటుపల్లి, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల సహకారంతో వైద్యులు డాక్టర్ అఖిల్ తేజ, డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ కె.ఎస్ కృష్ణతేజలు వైద్య సేవలందించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు సి.సూర్యచంద్రరావు, యమ్.రమణమూర్తి, వై.నాగేశ్వరరావు, ఎ.జె ప్రసాద్, ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ జీవన్, విద్యార్థులు, వైద్య కళాశాల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ స్వామి, నర్సింగ్ విద్యార్థినులు, ఫార్మసీ అసిస్టెంట్ రాధిక పాల్గొన్నారు.


వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై చంటిబాబు

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : ఎస్సై

గుడివాడ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మినీ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణీకులను తరలిస్తున్నట్లు, అది మంచి పద్ధతి కాదని రూరల్ ఎస్సై చంటిబాబు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి వలివర్తిపాడు, మల్లాయిపాలెం, బైపాస్‌ల వద్ద పరిమితికి మించి ప్రయాణీకులను తరలిస్తున్న ఆటోలను ఆపి వాహనదారులను మందలించారు. ఆటోల్లో 15, 18 మంది ప్రయాణీకులు ఉంటున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడ్డారు. ఇటువంటివి పునరావృతమైతే కేసులు నమోదు చేసి అరెస్టు చేయటం జరుగుతుందని ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. అలాగే మినీవ్యాన్‌లో సరుకు లోడుతో పాటు ప్రయాణీకులను కూడా ఎక్కువగా ఎక్కించుకోవటం జరుగుతుందని, ఇది చాలా ప్రమాదమన్నారు. వాహనాలు తక్కువ స్పీడ్‌లో వెళ్లాలని ఆయన కోరారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అవనిగడ్డ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మోదుమూడి గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. మోదుమూడి గ్రామానికి చెందిన సనకా లక్ష్మి (60) కుమారుడితో కలసి మోటారు సైకిల్‌పై అవనిగడ్డ వెళ్లేందుకు బయలుదేరగా, రోడ్డు మార్జిన్‌లో ఇసుకలో మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో లక్ష్మి బస్సు లారీ టైరు కింద పడిపోయింది. ఈ ఘటనలో బస్సు వెనుక టైరు లక్ష్మి తలపైకి ఎక్కటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.మోటారు సైకిల్ నడుపుతున్న ఆమె కుమారుడు, మనుమరాలు క్షేమంగా ఉన్నారని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సత్యదేవుడి ఆలయంలో పూర్ణాహుతిలో పాల్గొన్న కమిటీ సభ్యులు, గ్రామస్థులు

ఆలయ గోపుర జీర్ణోద్ధరణ

గుడ్లవల్లేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గ్రామంలో వేంచేసియున్న రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ గోపుర జీర్ణోద్ధరణ కార్యక్రమ పనులకు సంబంధించిన హోమం, పూర్ణాహుతి ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ మేరకు ప్రత్యేక పూజాకార్యక్రమాలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి మూలవిగ్రహాలకు పూజలు నిలుపుదల చేశారు. ఆస్థానంలో స్వామివార్ల చిత్రపటాలను ఏర్పాటు చేసి కళాకర్షణ నిర్వహించారు. అలానే ఆలయంలోని ఆంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ చేయనున్నారు. కార్యక్రమంలో వల్లభనేని వెంకటరావు, కొసరాజు బాపయ్యచౌదరి, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, వల్లభనేని వెంకటసుబ్బారావుచౌదరి, కాకాని రామారావు, అడుసుమిల్లి నాగేశ్వరరావు, యలమంచిలి రామకోటేశ్వరరావు, రవి, వెంకట్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : గుడివాడ పురపాలక సంఘం పరిధిలోని బీసీ, కాపు, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ(ఈడబ్ల్యూఎస్)కులాలకు చెందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణతో పాటు కుట్టుమిషన్లను అందజేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తుతో పాటు తహసీల్దార్ జారీ చేసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రైస్ కార్డు, మొబైల్ నెంబరుతో స్థానిక సచివాలయంలో దరఖాస్తును ఆన్‌లైన్ చేయించాలని కోరారు. దరఖాస్తుదారులు 18 నుండి 50ఏళ్ల లోపు వారే ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం ఆయా వార్డు సచివాలయాల్లో సంప్రదించాలని కమిషనర్ శ్రీనివాసరావు కోరారు.

వీరమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మామిడికోళ్ల గ్రామంలో వేంచేసియున్న వీరమ్మతల్లి నూతన ఆలయ అమ్మవారి , విఘ్నేశ్వర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం రెండోరోజు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హాజరై ప్రతిష్ఠించనున్న అమ్మవారి విగ్రహాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ వారు, జట్టి శ్రీరామ్(యుఎస్‌ఏ)లు ఎమ్మెల్యే రామును సన్మానించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వీరమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలంతా శుకసౌఖ్యాలతో ఆనందంగా ఉండాలని రాము అన్నారు. అమ్మవారి, విఘ్నేశ్వరుల విగ్రహాలు, కలశాలను మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. బలిహరణ, వాస్తు పూజ, వాస్తుహోమం, వాస్తుబలి, క్షీరాధివాసం,శాంతి హోమం, దిశాహోమం, కళా హోమం కార్యక్రమాలను సోమరాజుపల్లి ఈశ్వర నాగ కుమార శర్మ బృందంచే అత్యంత వైభవంగా శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ పురపాలక సంఘం పరిధిలోని బీసీ, కాపు, కమ్మ, క్షత్రీయ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ(ఈడబ్ల్యూఎస్)కులాలకు చెందిన వివిధ బీసీ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల దరఖాస్తుతో పాటు తహసీల్దార్ జారీ చేసిన కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రైస్ కార్డు, మొబైల్ నెంబరుతో స్థానిక సచివాలయంలో దరఖాస్తును ఆన్‌లైన్ చేయించాలని కోరారు. దరఖాస్తుదారులు 21 నుంచి 60ఏళ్ల లోపు వారే ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం ఆయా వార్డు సచివాలయాల్లో సంప్రదించాలని కమిషనర్ శ్రీనివాసరావు కోరారు.

అనధికార వసూళ్లపై కేసు నమోదు

గుడివాడ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ రూరల్ మండలంలోని మోటూరు గ్రామంలో గల సీతారామస్వామి దేవస్థానం ఆలయ ఈవో మోటూరి నాగమౌనిక సెక్షన్ 43/87 ప్రకారం గంటా హేమశేష శ్రీనివాసరావు తదితరులపై కేసు పెట్టినట్టు ఎస్సై చంటిబాబు ఆదివారం తెలిపారు. మోటూరు సీతారామ తిరుకల్యాణానికి అన్నదాన కమిటీలు ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయలేదని, గంటా హేమశేషు, శ్రీనివాసరావులు అన్నదాన కమిటీ పుస్తకాలు వేయించి అక్రమంగా వసూళ్లు చేస్తున్నట్టు ఫిర్యాదు చేశారన్నారు. తాను ఆలయ కమిటీ చైర్మన్ అని చెప్పుకుంటూ దేవాలయం పేరు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నాడని, దీనిని నివారించాల్సిందిగా ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలి : సీపీఎం

కూచిపూడి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చినముత్తేవిలోని ఐనంపూడి డ్రెయిన్‌పై తాత్కాలికంగా నిర్మించిన ఇనుప వంతెన శిథిలావస్థకు చేరిందని, శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని సీపీఎం నేతల బృందం డిమాండ్ చేసింది. ఈ బృందం గ్రామంలో పర్యటించి గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఐనంపూడి, గేదెల కోడ్ డ్రెయిన్లపై నిర్మించిన వంతెనలకు శాశ్వత వంతెన నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐలూరు నుంచి వచ్చే తాగునీరు రెండు, మూడు రోజులకొకసారి వస్తుందన్నారు. ప్రతి రోజూ తాగునీరు అందించాలని కోరారు. నిడుమోలు నుంచి మొవ్వ వరకు ఆర్టీసీ బస్సు నడపాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నివేశనాస్థలాలు ఇవ్వాలని పార్టీ మండల కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, దేవరపల్లి మణి, తూములూరి రమణ, వీరయ్య, వీరంకి స్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు.


శిథిలమైన వంతెన చూపుతున్న సీపీఎం నేతల బృందం

రెండు వర్గాలపై కేసు నమోదు

గుడివాడ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లింగవరం గ్రామానికి చెందిన రెండు వర్గాలు శుక్రవారం రాత్రి గొడవ పడినట్లు తెలిసింది. అదే గ్రామానికి చెందిన గంధం రంగబాబు పది మంది అనుచరులతో కలిసి తన ఇంటిపై దాడి చేసినట్లు గాదిరెడ్డి చిరంజీవి రెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుభకార్యానికి వెళ్తుండగా, చిరంజీవి రెడ్డి అతని ఇంటి వద్ద అడ్డగించాడని,తనను తన అనుచరులను కొట్టారని గంధం రంగబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులు స్వీకరించారు. ఆదివారం రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గుడివాడ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం దొండపాడు కాలనీకి చెందిన పరమాను పండు అనే వ్యక్తిని చినఎరుకపాడు వద్ద మార్చి 15వ తేదీ రాత్రి 11 గంటలకు అదే ప్రాంతానికి చెందిన అంబటి సాయి, ఇంటూరి చిట్టు తదితరులు తనపై దాడి చేసినట్టు ఫిర్యాదు చేశాడన్నారు. బొలెరో వాహనంలో చేపలు అమ్ముకోవటానికి విజయవాడ వెళ్తున్న సందర్భంలో దారి కాచి చిన ఎరుకపాడు వద్ద బీరు బాటిళ్ల, చేతితో కొట్టారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అమరజీవికి ఘన నివాళులు


పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక వాసవిచౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జవ్వాజి గంగరాజు, ప్రముఖులు శ్రీరాములు, కొత్త మురళీ, కసెట్టి శ్రీనివాస్, దుద్దు చిన్న, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక టూటౌన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, తిరుపతయ్య, ఉమా, నారాయణమూర్తి, హరిబాబు, మునీంద్ర, తాతారావు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వాసవి చౌక్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, కోన రామారావు, దిమ్మిటి శ్రీనివాసరావు, తమ్మినేని రామ్మోహనరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


పురపాలక సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

గుడ్లవల్లేరు : పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గుడ్లవల్లేరు గ్రామపంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాసవీ చౌక్‌లోని శ్రీరాములు విగ్రహానికి ఎంపీడీవో టి.విజయసారథి, కార్యదర్శి నరసింహారావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూచిపూడి: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను మొవ్వలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నంబూరి జగదీష్, పువ్వాడ సురేష్, జగన్మోహనరావు, ఉమా శంకర్, పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘంఅధ్యక్షుడు బి. రంగారావు, కె. శేషశ్రీనివాసరావు, సంఘం జిల్లా ప్రాంతీయ కార్యదర్శి తమ్మన ఉమామహేశ్వరరావు, ఉదయ సూర్య సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మొవ్వలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు


తోట్లవల్లూరులో పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 425

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

అవనిగడ్డ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మోదుమూడి గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. సనకా లక్ష్మి (60) కుమారుడితో కలిసి బైక్‌పై అవనిగడ్డ వెళ్లేందుకు బయలుదేరగా, రోడ్డు మార్జిన్ ఇసుకలో మోటార్ సైకిల్ బోల్తా కొట్టింది. ఆమె అటుగా వెళ్తున్న లారీ టైరు కింద పడిపోయింది. ఈ ఘటనలో టైరు తలపైకి ఎక్కటంతో లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందింది. మోటారు సైకిల్ తోలుతున్న లక్ష్మీ కుమారుడు, మనుమరాలు క్షేమంగా ఉన్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరస్మరణీయుడు వీర సుబ్బయ్య



వీర సుబ్బయ్య, దుర్గాంబ దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, ప్రేమలత, ప్రభాకరరెడ్డి

పెడన, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పెడనలో కలంకారీ పరిశ్రమను స్థాపించి ఎందరికో ఉపాధి కల్పించిన వీర సుబ్బయ్య చిరస్మరణీయుడని మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ అన్నారు. వీర సుబ్బయ్య కుమారుడు, ప్రముఖ కలంకారీ పారిశ్రామికవేత్త పిచ్చుక శ్రీనివాసరావు శ్యామల క్రాఫ్ట్ అండ్ ఆర్ట్స్ సంస్థలో ఏర్పాటు చేసిన కలంకారీ పరిశ్రమకు ఆద్యుడు స్వర్గీయ పిచ్చుక వీర సుబ్బయ్య, దుర్గాంబ దంపతుల విగ్రహాలను మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ, ఆయన సతీమణి ప్రేమలత, మాజీ కలెక్టర్ కలెక్టర్ కె.ప్రభాకరరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ, సహజ సిద్ధమైన రంగులతో కలంకారీ వస్త్రాలు తయారు చేయడం ద్వారా వీర సుబ్బయ్య అంతర్జాతీయ ఖ్యాతి గడించారన్నారు. వీర సుబ్బయ్య వారసత్వాన్ని ఆయన కుమారుడు శ్రీనివాసరావు, మనుమడు వరుణ్‌కుమార్ కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. మాజీ కలెక్టర్ కె. ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, వీర సుబ్బయ్య స్థాపించిన కలంకారీ పరిశ్రమ వేలాది మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. కలంకారీ కళాఖండాలను రూపొందించి రాష్ట్రపతి అవార్డు అందుకున్న కొండ్రు గంగాధర్, కొండ్రు నరసన్న, విజయానంద కళాశాల డైరెక్టర్ విద్యాధర్ పాల్గొన్నారు.

కలెక్టర్ డీకే బాలాజీకి అఖిల భారత యోగా సంస్థ ప్రశంసలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి నాడు 108 రౌండ్లలో సూర్య నమస్కారాలు, 1296 ఆసనాలు వేసిన కలెక్టర్ డీకే బాలాజీని ఆలిండియా యోగా ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఆచార్య దమయంతి అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. దమయంతి పంపిన ప్రశంసాపత్రాన్ని ఆదివారం కలెక్టర్ బాలాజీకి యోగా గురువు గురునాథబాబు అందజేశారు. ఉదయపు నడక మిత్రమండలి హాలులో కలెక్టర్ రెండు గంటల సేపు యోగ శిక్షణలో పాల్గొన్నారు. కలెక్టర్‌కు యోగాగురువులు గురునాథబాబు, మహాలక్ష్మి, చింతయ్య, ఆర్డీ ప్రసాద్ అభినందనలు తెలిపి సత్కరించారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

రీ-సర్వేపై అపోహ సృష్టిస్తే సహించేది లేదు : కాగిత



మచిలీపట్నం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రైతాంగానికి అండగా ఉండేది కూటమి ప్రభుత్వమేనని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. మచిలీపట్నం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రీ సర్వేపై వైసీపీ నాయకులు ప్రజల్లో అపోహ సృష్టించాలనుకుంటే సహించేది లేదన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు నగదు చెల్లించింది కూటమి ప్రభుత్వమేనన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్ర మం అమలు చేయబోతున్నామన్నారు. చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తూమాటి బసవయ్య, టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు, ఆళ్ల మాధవ పాల్గొన్నారు.



పైలాన్ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న మంత్రి రవీంద్ర

రాజకీయాలకతీతంగా బందరు అభివృద్ధి

మచిలీపట్నం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకతీతంగా మచిలీపట్నం నగరాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం పాత రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పైలాన్ పార్కులో రూ.15 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు టీడీపీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బండి రామకృష్ణలతో కలిసి మంత్రి రవీంద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు పిల్లలు ఆడుకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. బ్రిటీషు కాలంలో ఫిరంగిదిబ్బగా పేరొందిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. మూడు స్తంభాల సెంటర్ నుంచి పాత రైల్వేస్టేషన్ వరకు రోడ్డును 80 అడుగులకు విస్తరిస్తున్నామన్నారు. ఈ విస్తరణ పనుల్లో భూములు కోల్పోయిన వారికి నాలుగు రెట్ల విలువైన బాండ్లు అందిస్తామన్నారు. మచిలీపట్నంలో రూ.39 కోట్ల అమృత 2.0 నిధులతో మురిగునీటి శుద్ధి చేసే రెండు ప్లాంట్ల నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నామన్నారు. ఆక్రమణలను తొలగించడం పూర్తయినందున డ్రెయిన్ల అభివృద్ధి పనులకు నిధులు తీసుకుని వస్తామన్నారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ , టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగరాము, దేవరపల్లి అనిత, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగచాయాదేవి, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ బాషా, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అల్లా కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి

● ఇఫ్తార్ విందులో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అల్లా కృపతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 19వ డివిజన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, జనసేన నాయకుడు మాదివాడ రాము, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, పి.వి.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. సహాయ ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో కటకం ప్రసాద్ పాల్గొన్నారు.



మినార్ మసీద్ ఇఫ్తార్ విందులో బండి రామకృష్ణ తదితరులు

మినార్ మసీద్‌లో ఇఫ్తార్ విందు

మచిలీపట్నం కోనేరుసెంటర్ మినార్ మసీద్ ఆదివారం రాత్రి కులాలు, మతాలు, పార్టీలకతీతంగా ఇఫ్తార్ విందు జరిగింది. జనసేన అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, మచి లీపట్నం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ అబ్దుల్ మతీన్, జనసేన నాయకులు మాదివాడ రాము, గడ్డం రాజు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం భవనం పూర్తికి అంచనాలు

పాత రైల్వేస్టేషన్ ఎదురుగా అసంపూర్తిగా నిలిచిపోయిన మునిసిపల్ కార్యాలయ భవనాన్ని మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం సందర్శించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ 1864లో ఏర్పడిన మచిలీపట్నం మునిసిపాలిటీ నగరపాలకసంస్థగా రూపుదిద్దుకున్న తరుణంలో 2016లో నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. భవనాన్ని పునాదుల వరకు నిర్మించడం జరిగిందన్నారు తరువాత వచ్చిన వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్ల పనులు పూర్తి కాలేదన్నారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని మునిసిపల్ కార్యాలయ భవనం నిర్మాణం పూర్తి చేసేందుకు అంచనాలు తయారు చేయాలని మునిసిపల్ అధికారులకు సూచించామన్నారు. జనసేన నేత బండి రామకృష్ణ, టీడీపీ నేత కొనకళ్ల బుల్లయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, బచ్చు ల బోసు బాబు, గుమ్మడి విద్యాసాగర్ , గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్ , దేవరపల్లి అనిత , దింటకుర్తి సుధాకర్ , జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగచాయాదేవి, మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో భక్తుల రద్దీ

● ఒక్కరోజు ఆదాయం రూ.9.96 లక్షలు



మోపిదేవి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ప్రత్యేకత కావటంతో భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నాగ వల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో వివిధ సేవా రుసుముల ద్వారా ఒక్కరోజునే రూ.9,96,628 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

ఆలయానికి చేరిన నాంచారమ్మ

కోడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ గ్రామోత్సవం ముగించుకుని ఆదివారం ఆలయానికి చేరింది. ఈనెల 14న జాతర ముగియటంతో అమ్మవారు ఆలయానికి చేరినట్లు ఈవో జయశ్రీ తెలిపారు. ప్రధాన అర్చకులు పార్థసారధి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేంద్ర మంత్రి పెమ్మసానితో కృష్ణా వర్సిటీ వీసీ రాంజీ భేటీ




మచిలీపట్నం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆదివారం అమరా వతిలో కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె. రాంజీ మర్యాద పూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయం అభివృద్ధిపై కేంద్ర మంత్రితో ఆయన చర్చించారు.




200 మందికి ఉచిత వైద్యసేవలు

ఘంటసాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలలోని పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో ఆదివారం మల్లంపల్లి రోడ్డులోని రాఫా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గుడ్‌ఫ్రై డే, ఈస్టర్ పర్వదినాల సందర్భంగా ప్రజలకు ఉచిత ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. మచిలీపట్నానికి చెందిన డాక్టర్ తోట వీరేంద్రనాథ్ బీపీ, షుగర్, జలుబు, దగ్గు, అస్తమా, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, దీర్ఘకాలిక వ్యాధులు, వర్టిగో, పక్షవాతం వంటి వాధ్యులకు పరీక్షలు జరిపారు. సుమారు 206 మంది రోగులకు పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో రూ.40 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. పాస్టర్ కోలా దానియేలు, పి.ఎన్.రాజు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకులు సుకన్య, కిరణ్, సునీత, సంఘ సభ్యులు రాము, బాలాజీ, వినయ్, వెంకటరత్నం, ప్రశాంత్, సన్నీ, పాల్ డానియేలు, చంద్రశేఖర్, బిందు, పార్థు, రాకేష్, పృథ్వీ, దాసు తదితరులు ఎ

87 మందికి కంటి పరీక్షలు



నాగాయలంక, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మారుతీ విద్యానికేతన్ ఆధ్వర్యంలో ఆదివారం శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో జరిగిన వైద్యశిబిరంలో పాల్గొన్న 87 మంది రోగులకు డాక్టర్ అరుణ్ చంద్ర ఉచిత పరీక్షలు చేసి 54 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ, క్యాంప్ ఇంచార్జ్ గంగాదర్, మత్తి శివ, జమీల, మస్తాన్ పాల్గొని పర్యవేక్షించారు.



వేకనూరులో వైభవంగా సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాజశేఖర శర్మ బ్రహ్మత్వంలో మల్లిఖార్జునరావు - గంగాభవాని దంపతులు పీటల మీద కూర్చుని వివాహం జరిపించారు. బండి సూర్యతేజ ఆర్థిక సాయంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘననివాళి



మచిలీపట్నంలో...



పెడనలో..



చల్లపల్లిలో..

మచిలీపట్నం టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జయంతి సందర్భంగా ఐదు రోడ్ల సెంటర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయం చైర్మన్ మామిడి మురళీకృష్ణ, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి మాదిరెడ్డి అంజిబాబు, న్యాయవాదులు లంకిశెట్టి బాలాజీ, గరిమెళ్ళ ప్రభాకరరావు, కె. ఆంజనేయులు, ఎస్.పవన్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : అమరజీవి పొట్టిశ్రీరాములు 125వ జయంతిని ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. కన్యకా పరమేశ్వరీ అమ్మవారి కల్యాణమండపం ఆవరణలోని పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు, కార్యదర్శి వరదా హరి గోపాల్, తమ్మన సతీష్‌కుమార్, కొల్లిపర మధు, జూపూడి సాయి, కొల్లిపర సాంబశివరావు, రాజశేఖర్, శ్రీను, నరసింహారావు, నరేంద్ర, వెంకటరత్నం, బాబు తదితరులు పాల్గొన్నారు.లక్ష్మీపురంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు జూపూడి సాయి, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్‌కుమార్, గోళ్ల సుబ్బారావు, కోడూరు పూర్ణచంద్రరావు, సిహెచ్.శ్రీనివాసరావు, పి.జలంధర్ తదితరులు పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **ఘంటసాల** : ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. శాస్త్రవేత్తలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. శాస్త్రవేత్తలు యశ్వంత్ కుమార్, డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక** : స్థానిక ఆర్యవైశ్య సంఘం, మండల వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో నాగాయలంక సెంటర్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. సెంటర్‌లో శ్రీరాములు చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. సంఘం భవనం వద్ద నున్న అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. చిట్టా సాంబశివరావు, శివనాగేశ్వరరావు, వీర అన్నపూర్ణయ్య, చిట్టా శేఖర్, తాడికొండ సత్యనారాయణ తదిరతులు పాల్గొన్నారు. **అవనిగడ్డ** : అవనిగడ్డలో పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. టీడీపీ పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్, టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, టీడీపీ నేతలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **పెడన** : ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ కొల్లూరి చిన్నా ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. వాసవీ ప్రార్థనా మందిరంలో పాత కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంజులత, కొల్లూరి రాజా, దేసు శ్రీనివాస్, మామిడి సావిత్రి, చిట్టూరి పశుపతినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, సిబ్బంది నివాళులర్పించారు.



నాగాయలంకలో..



అవనిగడ్డలో..

అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం



అగ్నికుల క్షత్రియ నాయకులతో టీడీపీ నేతలు

అవనిగడ్డ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ అన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అగ్నికుల క్షత్రియ ప్రతినిధులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ విభాగం జిల్లా కన్వీనర్ లకనం నాగాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అగ్నికుల క్షత్రియ ప్రతినిధులు తీర ప్రాంత గ్రామాల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియుల స్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. సమస్యలను మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బుద్దప్రసాద్, ఎంపీ బాలశౌరి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. బొబ్బా గోవర్ధన్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో అగ్నికుల క్షత్రియుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తీరగ్రామాల్లో అభివృద్ధి విషయంలో అటవీశాఖాధికారులు ప్రవర్తిస్తున్న తీరుపై గోవర్ధన్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. అగ్నికుల క్షత్రియుల ప్రతినిధులు కన్నా నాగరాజు, నడకుదుటి జనార్ధనరావు, కర్రి కృష్ణమూర్తి, విశ్వనాథపల్లి భిక్షం, సైకం దినేష్, కొక్కిలిగడ్డ నాగరాజు, కొప్పనాతి సత్యనారాయణ, నాగిడి శివనాగేశ్వరరావు, విశ్వనాథపల్లి సోమేశ్వరరావు తదితరులు సమస్యలను ప్రస్తావించారు.